సాక్షి
ప్రకాశం
సోమవారం । 8 । మే । 2023



దార్శనికుడు దామోదరం సంజీవయ్య
దామోదరం సంజీవయ్య దార్శనికుడని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు.
- 8లో..



ప్రశాంతంగా 'నీట్'
ఒంగోలులోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో నీట్ పరీక్ష నిర్వహించారు. మూడు సెంటర్ల లో పరీక్షలు జరిగాయి. 25 మంది గైర్హాజరయ్యారు.
- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35 /28

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు: రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జిల్లా నుంచి 8 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం జిల్లా సీనియర్ ఓపెన్, మహిళా పోటీలు జరిగాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన సీనియర్ ఓపెన్ విభాగంలో జేకే రాజు, వై.శ్రీకాంత్, జి.విష్ణు, పి.కుమారస్వామిలతో పాటు మహిళల విభాగంలో ప్రతిభ కనబరిచిన కె.సాయినిరుపమ, జి.ప్రియాంక, ఈ.లాస్యశ్రీ, బి.సునయనలను ఎంపిక చేశారు. ఎంపికైన వీరు ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను ప్రకాశం జిల్లా చెస్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె అబ్దుల్ నబీ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో కంపకల్లి



కంపకల్లిపై దొర్లుతున్న భక్తులు

హనుమంతునిపాడు: మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామంలో ఉన్న లక్ష్మీ చెన్నకేశవస్వామి తిరునాళ్ల సందర్భంగా ఏటా సంప్రదాయంగా వచ్చే కంపకల్లిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం పరిధిలో పెరిగిన కంపను తీసుకువచ్చి ఆరు నుంచి పది అడుగుల ఎత్తులో కంపను పేర్చారు. సంతానం లేని తల్లులు తమకు పిల్లలు పుడితే ఆ బిడ్డలను కంపకల్లిపై దొర్లిస్తామని మొక్కుకుంటారు. అలా చేస్తే బిడ్డలకు ఎలాంటి రోగాలకు రావని నమ్ముతారు. అయితే 14 ఏళ్ల లోపు పిల్లలను కంప కల్లిపై దొర్లించకూడదని అంగన్‌వాడీ అధికారులు, పోలీసులు అడ్డుకుంటున్నారు. దీంతో పిల్లలను కంపకల్లికి తాకించి తీసుకు వెళ్లిపోతున్నారు. భక్తులు అర్ధనగ్నంగా ముళ్ల కంపపై దొర్లుతూ గోవింద అంటూ తమ భక్తిని చాటుకున్నారు. పాలెగాళ్లు కొనతాళ్లను ఎత్తుకొని పోతురాజుతో కంపకల్లి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ వేడుకను చూసేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. సీఐ శివరామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో హనుమంతునిపాడు ఎస్సై జి.క్రిష్ణపావని, కనిగిరి ఎస్సై డి.ప్రసాదు, వెలిగండ్ల ఎస్సై మహేష్, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.



కంపకల్లిపై పిల్లలను దొర్లించకుండా అడ్డుకునేందుకు వచ్చిన ఐసీడీఎస్ సిబ్బంది

పదిలో సర్కారీ స్కూళ్ల ప్రభంజనం

ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించాయి. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉత్తమ విద్యాబోధన అందించడం, ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించడంతో విద్యార్థులు పోటీపడి చదివి మంచి మార్కులు సాధించారు. ప్రత్యేకంగా గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులతో మెరిశారు.

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు
- గణపవరం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థికి అత్యధికంగా 590 మార్కులు
- తరువాతి స్థానంలో ఎస్‌ఎన్‌పాడు ఏపీఆర్ స్కూల్, వెలిగండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు
- జిల్లాలో 9 ప్రభుత్వ పాఠశాలల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత

ఒంగోలు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఢీ అంటే ఢీ అన్నారు. తాము సైతం అంటూ అద్భుత ఫలితాలు సాధించి ప్రభుత్వ విద్యావిధానం సత్తాను చాటారు. గణపవరం ఏపీఆర్‌ఎస్ విద్యార్థి దండెబోయిన బాజి 590 మార్కులతో ఔరా అనిపించాడు. సంతనూతలపాడు ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థి బండారు కార్తీక్ 589 మార్కులు సాధించగా, వెలిగండ్ల జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రహల్లాదరెడ్డి, హరికృష్ణ 586 మార్కులు సాధించారు. అంతేకాకుండా జిల్లాలో 9 ప్రభుత్వ పాఠశాలలు ఏకంగా వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించి ఉన్నతాధికారులు, ప్రజల ప్రశంసలు అందుకున్నాయి. జిల్లాలో మొత్తం 308 ప్రభుత్వ పాఠశాలలున్నాయి.

65.58 శాతం మందికి ప్రథమ శ్రేణి:
జిల్లాలో రెండు విద్యాశాఖ డివిజన్‌లు ఉన్నాయి. ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి పరిధిలోని 141 ఉన్నత పాఠశాలల నుంచి 2981 మంది ప్రథమశ్రేణి, 1157 మంది ద్వితీయ శ్రేణి, 471 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి పరిధిలోని 167 పాఠశాలల నుంచి 3938 మంది ప్రథమ శ్రేణి, 1401 మంది ద్వితీయ శ్రేణి, 603 మంది తృతీయ శ్రేణిలోను ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 6919 మంది (65.58 శాతం), ప్రథమ శ్రేణి, 2558 మంది (24.24 శాతం) ద్వితీయ శ్రేణి, 1074 మంది (10.18 శాతం) తృతీయ శ్రేణి సాధించారు. 570కిపైగా మార్కులు సాధించిన వారు 40 మంది ఉండగా, 500కు పైగా మార్కులు సాధించిన వారు 233 మంది ఉన్నారు.



వరుసగా మూడేళ్లు నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన సంతనూతలపాడు గురుకుల బాలికల పాఠశాల

వ్యవసాయ కూలి కుమారుడికి 590 మార్కులు

త్రిపురాంతకం: మండలంలోని ఉమ్మడివరం గ్రామానికి చెందిన దండెబోయిన బాజి తండ్రి ముసలయ్య వ్యవసాయ కూలి. తల్లిదండ్రులు ఇద్దరూ నిరక్షరాస్యులు. పట్టుదలతో చదివి ఉన్నత స్థితిలో ఉండాలన్న లక్ష్యంతో గణపవరం ఏపీఆర్ స్కూల్లో చదువుతూ ప్రభుత్వం ద్వారా అందుతున్న జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి పథకంలాంటివి అందిపుచ్చుకుని కష్టపడి చదువుకున్నాడు. ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయుల తోడ్పాటుతో పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో అత్యధికంగా 590 మార్కులు సాధించాడు. గణపవరం ఏపీఆర్ స్కూల్ విద్యార్థులు 98.5 శాతం పాస్ అయ్యారు. ఇదే పాఠశాలకు చెందిన బీవీ నాగరాజు 589, పి.బాలగోపాల్ 588 మార్కులు సాధించారు.



ఏపీఆర్‌ఎస్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి

బేల్దారి కుమారుడికి 589 మార్కులు..



చీమకుర్తి: పెద్దదోర్నాల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బండారు కార్తీక్ సంతనూతలపాడు గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలోనే చేరాడు. అతని తండ్రి పెదకాశయ్య బేల్దారి పనులకు వెళ్తుండగా..తల్లి వెంకటరమణ టైలరింగ్ చేస్తోంది. గురుకుల పాఠశాలలో వసతులు బాగున్నాయి. క్రమశిక్షణ అలవర్చడంతో పాటు బాగా చదువు చెప్పారు. స్టడీ అవర్స్ నిర్వహించారు. దీంతో కార్తీక్ కూడా కష్టపడి చదివి పదో తరగతిలో 589 మార్కులు సాధించాడు. ఇంటర్‌లో ఎంపీసీ గ్రూప్ తీసుకొని ఇంకా బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనుకుంటున్నట్లు చెప్పాడు.

కూలీ కుమార్తెకు 583 మార్కులు



మార్కాపురం: మార్కాపురం మండలం రాయవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని మాగులూరి ఇందిర 583 మార్కులు సాధించింది. కురిచేడు మండలం ఆవులమంద గ్రామానికి చెందిన ఇందిర తండ్రి మాగులూరి యోహాన్, తల్లి శారమ్మ ఇద్దరూ కూలి పనులకు వెళ్తున్నారు. తమ కుమార్తె మంచి మార్కులు సాధించడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురుకుల పాఠశాలలో 75 మంది పరీక్షలు రాయగా..71 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

వరుసగా మూడేళ్లు నూరు శాతం

- సంతనూతలపాడు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థుల ప్రతిభ

చీమకుర్తి: సంతనూతలపాడు గురుకుల బాలుర పాఠశాల పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వరుసగా మూడేళ్ల నుంచి నూరు శాతం విద్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీ.మెర్సీ తెలిపారు. రెండు రోజుల క్రితం ప్రకటించిన ఈ సంవత్సరానికి సంబంధించిన (2022-23) ఫలితాల్లో పదో తరగతిలో మొత్తం విద్యార్థులు 74 మంది ఉంటే అందరూ ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది 2021-22 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు 67 మంది ఉంటే మొత్తం 67 మంది విద్యార్థులు ఉత్తీర్ణతతో నూరు శాతం సాధించారు. 2020-21లో మొత్తం 37 మంది ఉంటే అందరూ ఉత్తీర్ణులై నూరు శాతం నిలబెట్టుకుంది. 2019-20, 2018-19 రెండు సంవత్సరాల కరోనా కాలంలో కూడా పాఠశాలలో ఉన్న విద్యార్థులందరూ పరీక్షలు లేకుండానే నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లయింది. ఇలా వరుసగా సంతనూతలపాడు గురుకుల బాలుర పాఠశాలలో ఐదేళ్ల పాటు నూరు శాతం ఫలితాల్లో ఉత్తీర్ణత సాధిస్తూ జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా పేరు నిలబెట్టుకుంది. ఈ ఏడాది పదో తరగతి రాసిన బండారు కార్తీక్ 589 మార్కులు సాధించాడు. జే.అశోక్ 586, పీ.శివరంగయ్య 583 మార్కులు సాధించి సంతనూతలపాడు గురుకుల బాలుర పాఠశాల పేరును నిలబెట్టారు.

ఉత్తమ ఫలితాలతో గుభాళిస్తున్న గురుకులం

కొండపి: స్థానిక గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు కొన్నేళ్లుగా పదో తరగతి ఫైనల్ ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలలకు మించి వంద శాతం ఉత్తీర్ణతతో దూసుకుపోతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా ఏమిటో చాటుతున్నారు. కొండపి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఈ సంవత్సరం 77 మంది బాలికలు పదో తరగతి ఫైనల్ పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. వారిలో 74 మంది ప్రథమ శ్రేణిలో నిలిచారు. పాఠశాలకు చెందిన జీ దీప్తి 567 మార్కులు సాధించింది. గణితంలో ఇద్దరు విద్యార్థులు 98 మార్కులు సాధించగా సైన్సులో 99 మార్కులు, సోషల్‌లో ఇద్దరు బాలికలు నూటికి నూరు మార్కులు సాధించారు. గురుకులంలో బాలికలు 2015-16 విద్యాసంవత్సరం నుంచి ఏటా పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతతో మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ అరుణ తెలిపారు. ఉపాధ్యాయులు బోధన, క్రమశిక్షణతో కూడిన విద్య, ప్రభుత్వ ప్రోత్సాహం వలనే గురుకులంలో ఇటువంటి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.



కొండపి బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల

కష్టపడి చదువుకున్నా..



మొగళ్లూరు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదివాను. మా నాన్న ఆవుల శ్రీనివాసులు వ్యవసాయ పనులు చేస్తున్నారు. మా హెచ్‌ఎం రాజాల కొండారెడ్డి, ఉపాధ్యాయులు పాఠ్యాంశాలపై మంచి తర్ఫీదునిచ్చారు. పాత ప్రశ్నపత్రాలను విశ్లేషించి మంచి మార్కులు వచ్చేలా చూశారు. నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. నా కుటుంబంలో పెద్దగా చదువుకున్న వాళ్లు లేకున్నా నేను బాగా కష్టపడి చదివి 586 మార్కులు తెచ్చుకున్నా. ఐఏఎస్ సాధించడం నా లక్ష్యం.

– ఆవుల ప్రహల్లాదరెడ్డి, 586 మార్కులు

ఐఐటీలో సీటు సాధిస్తా..



మా నాన్న చనిపోయారు. మా అమ్మ లీలావతి కిరణాకొట్టు నడుపుకుంటూ మమ్మల్ని చదివిస్తోంది. మొగళ్లూరు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుకుని 586 మార్కులు తెచ్చుకున్నా. మా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు చక్కగా శిక్షణ ఇచ్చారు. స్టడీ అవర్స్ నిర్వహించడం మాకు బాగా కలిసొచ్చింది. ఐఐటీలో సీటు సాధించాలనేది నా లక్ష్యం.

– నేరెళ్ల హరికృష్ణ, 586 మార్కులు

మోడల్ విద్యార్థుల ప్రతిభ

దర్శి: పదో తరగతి పరీక్షల్లో దర్శి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. నూతలపాటి సౌగంధిక 581 మార్కులు సాధించింది. మొగిలి పాలెపు సంతోష్ 576, ఎస్‌అఖిల్ 574 మార్కులు సాధించారు. 550 పైగా 6 మంది, 500పైగా మార్కులు 33 మంది విద్యార్థులు సాధించారు. ప్రధానోపాధ్యాయురాలు హసీనా బేగం వారిని అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హసీనాబేగం

చదువుల్లో మేటి పాఠశాల



అమ్మనబ్రోలు రెసిడెన్షియల్ పాఠశాల

నాగులుప్పలపాడు: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు నడుస్తున్నాయని అమ్మనబ్రోలు రెసిడెన్షియల్ బాలికల పాఠశాల మరోమారు నిరూపించింది. పదో తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ పాఠశాల నుంచి 75 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ శైలజ ప్రియదర్శిని తెలిపారు. వీరిలో ముగ్గురు విద్యార్థినులు లెక్కలు సబ్జెక్టులో నూటికి నూరు మార్కులు, సైన్స్‌లో ఒకరికి నూరు మార్కులు, తెలుగులో నలుగురు విద్యార్థినులు నూటికి నూరు మార్కులు సాధించినట్లు తెలిపారు.

డాక్టరే లక్ష్యంగా చదువుతున్నా



డాక్టర్ కావాలన్నదే లక్ష్యంగా చదువులో రాణిస్తాను. పదో తరగతి ఫలితాల్లో 585 మార్కులు వచ్చాయి. మాది త్రిపురాంతకం మండలం కొత్త అన్నసముద్రం. మేము ముగ్గురం అక్కచెల్లెళ్లం. మా నాన్న పొట్ల వెంకట్రామయ్య ఉన్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకుంటూ మమ్మల్ని చదివిస్తున్నారు. సీటు సాధించడంలో జిల్లా వ్యాప్తంగా ఎంతో పోటీతత్వం ఉండే అమ్మనబ్రోలు రెసిడెన్షియల్ పాఠశాలలో ముగ్గురం సీట్లు తెచ్చుకున్నాం. ఇక్కడ చదువు బాగా చెప్పడంతో మంచి మార్కులు వచ్చాయి.

– పొట్ల శ్రీలత, 585 మార్కులు, అమ్మనబ్రోలు రెసిడెన్షియల్ స్కూల్

స్టడీ అవర్స్ వల్లే మంచి మార్కులు



మాది పామూరు. ఏపీ మోడల్ స్కూల్లో సీటు సాధించి, బీసీ హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నా. స్కూల్లో ప్రతిరోజూ స్టడీ అవర్స్ పెట్టేవారు. పదో తరగతిలో 582 మార్కులు వచ్చాయి. సైన్స్‌లో వందకు వంద వచ్చాయి. ఐఐటీలో సీటు సాధించాలన్నదే నా లక్ష్యం.

– ఏ మణికంఠ, 582 మార్కులు, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి

ఆర్యవైశ్యులు నా ఆత్మీయులు

- మీకు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటా
- గోల్డ్‌మర్చంట్స్ అసోసియేషన్ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



బాలినేని శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ఏపీ బులియన్ గోల్డ్‌సిల్వర్ అండ్ డైమెండ్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు

ఒంగోలు: ఆర్యవైశ్యులంతా తనకు ఆత్మీయులని, ఎవరికి ఏ అవసరం వచ్చినా తప్పక అండగా ఉంటానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏ1 ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఏపీ బులియన్, గోల్డ్ సిల్వర్, డైమండ్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన మాట్లాడుతూ గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను తప్పక పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఒంగోలు గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు ఎప్పుడు సామాజిక సేవ కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయం అన్నారు. నూతన కార్యవర్గం కూడా ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో మంచి కీర్తిని పొందాలన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం బాలినేని శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిల్‌వాయ్ విజయ్‌కుమార్, చీఫ్ ఆర్గనైజర్ శాంతి లాల్, ప్రధాన కార్యదర్శి బొమ్మిరెడ్డి శంకర్, ఒంగోలు సంఘం అధ్యక్షుడు తాతా ప్రసాదు, కార్యదర్శి పి.రమేష్ కుమార్, చైర్మన్ దాసరి నారాయణ రావు, స్పీకర్ గ్రంధి చెంచురామారావుతోపాటు రాష్ట్రం నలుమూలల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే నవరత్నాలు

- మంత్రి ఆదిమూలపు సురేష్



సోమేపల్లిలో వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

పెద్దారవీడు: పేదల అభ్యున్నతికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు అమలు చేస్తున్నారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండలంలో తోకపల్లె గ్రామ సచివాలయ పరిధిలో సోమేపల్లె, హనుమాన్ జంక్షన్ కుంటలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ ఫలాల గురించి లబ్ధిదారులకు వివరించారు. బీసీ కాలనీలో తాగునీటి బోరును ప్రారంభించారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన కొత్త శ్రీను కుటుంబ సభ్యులకు మంత్రి చేతుల మీదుగా మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల దయా దాక్షిణ్యాలు కావాల్సి వచ్చేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా, పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వైఎస్సార్ సీపీకి పెరుగుతున్న ప్రజా మద్దతు చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులకు ముందుగానే ఓటమి భయం పట్టుకుందని, టీడీపీ పొత్తులు లేనిదే ఎన్నికల్లో పోటీ చేయలేని దుస్థితి ఉందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ పొలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, సర్పంచ్ జిల్లెల మల్లేశ్వరి, తిరుమలనాథస్వామి ఆలయ చైర్మన్ దుద్దెల వెంకటరెడ్డి, డీఎల్‌డీఓ సాయికుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ వేణుగోపాలరావు, డీఈఈ సుబ్బారెడ్డి, విద్యుత్ ఏఈలు రమేష్, హౌసింగ్ ఏఈ శావ్య, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఓ సాంబశివయ్య, ఎంఈఓ శ్రీనివాసులు, పీఎస్ శ్రీనివాసులు, మండల సోషల్ మీడియా కన్వీనర్ సాంటి నాగార్జునరెడ్డి, నాయకులు రామచంద్రుడు, తాళ్లూరి సాయికృష్ణ, ఉప్పలపాటి పెద్దకాశయ్య, మేకల కాశయ్య, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కమనీయం వెంకటేశ్వరుని కల్యాణం

- గోవింద నామాలతో మార్మోగిన మల్లవరం

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మల్లవరం వెంకటేశ్వరస్వామి కల్యాణం ఆగమ ప్రవర దివి వెంకట శేషాచార్యుల వారి అధ్వర్యంలో ఆలయ అర్చకులు నారాయణం వెంకటాచార్యులు కన్నుల విందుగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామివారి కల్యాణానికి ఆనవాయితీగా గుండ్లాపల్లి గ్రామానికి చెందిన పల్లకి సుబ్బరామిరెడ్డి, పల్లకి పేరారెడ్డి దంపతులు, మణికంఠ శ్రీనివాసరెడ్డిలు తలంబ్రాలు తీసుకు రాగా ఆలయ కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి, ఈఓ దామా నాగేశ్వరరావు ఆహ్వానించారు. అనంతరం అర్చకులు స్వామివారి కల్యాణాన్ని ప్రారంభించారు. స్వామివారి కల్యాణానికి ఉదయం నుంచే ప్రజలు భారీగా తరలివచ్చారు. మల్లవరం కొండపై గోవిందనామాలు మార్మోగాయి. ఒంగోలు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించిన భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించి మల్లవరం రిజర్వాయర్ వద్ద ఉన్న పార్కులలో సేదతీరి బోటు షికారు చేస్తూ యువత సరదాగా గడిపారు. సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు.

మల్లవరం వెంకన్నను దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్

మద్దిపాడు: మండలంలోని మల్లవరం గ్రామంలో



అమ్మవారి తాళిబొట్లు భక్తులకు చూపుతున్న అర్చకస్వాములు



మల్లవరం వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

వెలసిన వెంకటేశ్వరస్వామి కల్యాణం సందర్భంగా ఆదివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మర్యాదలతో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. అనంతరం స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ప్రసాదాన్ని, శేషవస్త్రాలను జెడ్పీ చైర్‌పర్సన్‌కు అందించారు. అనంతరం ఆమె స్వామివారి ఆలయ ప్రాంగణం వెలుపల ఏర్పాటు చేసిన కల్యాణ కట్ట వద్ద శ్రీవారి వనం లో మొక్క నాటారు. కార్యక్రమంలో వారి వెంట ఆయల కమిటీ చైర్మన్ నారా నాగిరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఈఓ దామా నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

10 నుంచి జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు

కొనకనమిట్ల: మండలంలోని గరిమినపెంటలో ఈ నెల 10నుంచి యువత ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమ్మర్ క్యాంప్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్న మెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రికెట్ క్రీడాకారులు 9వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి, రెండు, మూడు బహుమతులుగా రూ.20116, రూ.15116, రూ.10116లను దాతల సహకారంతో అందజేస్తామన్నారు. అలాగే విన్నింగ్ కప్, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, సిరీస్, కమిటీ కిట్ బహుమతిగా ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9505350217, 9000575169 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పిడుగుపాటుకు 3 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

కొమరోలు: మండలంలోని నల్లగుంట్ల గ్రామ సమీపంలో పిడుగుపాటుకు 3 గొర్రెలు మృతి చెందాయి. మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన ఓ మోస్తారు వర్షం కురిసింది. నల్లగుంట్ల గ్రామ సమీపంలో తంబళ్లపల్లె గ్రామానికి చెందిన క్రిష్ణ గొర్రెలను మేపుకుంటూ రాగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో పిడుగు పడడంతో అక్కడికక్కడే 3 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల విలువ రూ.70 వేలు ఉంటుందని యజమాని వాపోయాడు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ఉలవపాడు: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కరేడు పంచాయతీ టెంకాయచెట్లపాలెంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..టెంకాయచెట్లపాలెంకు చెందిన కోటం గారి చినకోటయ్య (55) తన ఇంటి పక్కనే ఉన్న స్థలంలో కూరగాయలు సాగు చేస్తున్నాడు. విద్యుత్ రాకపోవడంతో వెళ్లి వైర్లు కదిలిస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దార్శనికుడు.. దామోదరం సంజీవయ్య


సంజీవయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

- వర్ధంతి సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నివాళులు

ఒంగోలు: దామోదరం సంజీవయ్య దార్శనికుడని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రకాశం భవనం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి బాలినేని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా శ్రమించిన దామోదరం సంజీవయ్య ప్రతిఒక్కరికీ ఆదర్శమని కొనియాడారు. మంచి మనసు గల సంజీవయ్య విగ్రహాన్ని అత్యంత పేదవాడైన అరుణ్‌కుమార్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తాను అరుణ్‌కుమార్‌ను సంజీవయ్య అనే పిలుచుకుంటుంటానంటూ అరుణ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో నివాళులర్పించిన మంత్రి సురేష్

మార్కాపురం: తొలిదళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య మహనీయుడని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదివారం దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా మార్కాపురం పట్టణంలోని జార్జి గెస్ట్‌హౌస్‌లో సంజీవయ్య చిత్రపటానికి మంత్రి సురేష్ నివాళులర్పించారు. 38 ఏళ్ల వయసులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత సంజీవయ్యకు దక్కుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో త్రిపురాంతకం ఎంపీపీ సుబ్బారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల పిచ్చియ్య, వైఎస్సార్ సీపీ పెద్దారవీడు మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మార్కాపురం పట్టణాధ్యక్షుడు బాబి, తదితరులు పాల్గొన్నారు.


మార్కాపురంలో నివాళులర్పిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, నాయకులు

బ్యారన్ దగ్ధం

- రూ.4 లక్షల ఆస్తినష్టం

మద్దిపాడు: బ్యారన్ దగ్ధమై రూ.4 లక్షల ఆస్తి నష్టం సంభవించిన సంఘటన మండలంలోని లింగంగుంట గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తలకొండపాటి అంజయ్య, తలకొండపాటి బ్రహ్మయ్యలకు చెందిన బ్యారన్‌లో 1100 పొగాకు కర్ర పెట్టి ఉండగా, మొద్దు గొట్టంపై పొగాకు పడటంతో బ్యారన్‌లోని పొగాకు కర్రలు ట్రైర్లతో సహా మొత్తం కాలిపోయాయి. స్థానికులు ఒంగోలు అగ్నిమాపకశాఖ కార్యాలయానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలార్పారు. అప్పటికే రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

దర్శి: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని కట్టుబడిపాలెంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన మాదాసు వెంకటేశ్వర్లు (27) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్వర్లు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు.

తైక్వాండోలో సత్తా చాటిన విద్యార్థులు

- బెల్టు పరీక్షలలో పలువురి ప్రతిభ
- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి తైక్వాండో స్టేడియానికి స్థలం కేటాయించాలని వినతి


ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో తైక్వాండో కోచ్‌లు

ఒంగోలు: తైక్వాండోలో వివిధ రకాల బెల్టులకు సంబంధించి ఆదివారం నిర్వహించిన పరీక్షలలో పలువురు విద్యార్థులు సత్తాచాటారు. స్థానిక సీవీఎస్ రీడింగ్ రూం ఆవరణలో నిర్వహించిన ఈ పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఎస్ఎంఎల్ శ్రీనివాస్, యు.శ్రీధర్, ఎం.నికితారెడ్డి, జి.కార్తీక్, వి.కార్తీక్‌లు రెడ్ బెల్ట్ సాధించారు. పి.విఘ్నేష్, కె.సంధ్య, పి.దేవా, రిషిత, సాయికృష్ణ బ్లూ, గ్రీన్ బెల్టులు కైవసం చేసుకున్నారు. వారికి తైక్వాండో జాతీయ కోచ్, చాంపియన్ ఎస్కే కరిముల్లా ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. బెల్టులు సాధించిన విద్యార్థులను అభినందించిన వారిలో అక్కిరెడ్డి, ఎస్ఎం బాషా, బి.మురళి, దర్గా చందుబాషా, సహాయ కోచ్ ఎస్కే ఆరిఫ్ (సెకండ్ డాన్), ఎం.ప్రశాంత ఉన్నారు.

ఎమ్మెల్యే బాలినేనిని కలిసిన తైక్వాండో కోచ్‌లు...

తైక్వాండో కోచ్‌లు వైకే శ్రీనివాసరావు, ఎస్కే హబీబుల్లా, వి.శరవణ, తదితరులు ఆదివారం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిశారు. తైక్వాండో ఇంటర్నేషనల్ మాస్టర్స్, ఎగ్జామినర్స్, ఫైటర్స్ ఎంతోమంది జిల్లాలో ఉన్నారని, అందువలన తైక్వాండోకు ఒక ఇండోర్ స్టేడియం అవసరమని బాలినేని దృష్టికి తీసుకెళ్లారు. తైక్వాండో స్టేడియం ఉంటే మరింతమంది క్రీడాకారులను తయారుచేసేందుకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. బాలినేని స్పందిస్తూ పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు వైకే శ్రీనివాసరావు తెలిపారు.


సత్తా చాటిన విద్యార్థులను అభినందిస్తున్న తైక్వాండో జాతీయ కోచ్ కరిముల్లా

పుట్టింటికి వస్తూ రోడ్డు దాటుతుండగా మహిళ దుర్మరణం

బల్లికురవ: పుట్టింటికి వస్తూ బస్సు దిగి రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న కారు ఢీకొట్టటంతో ఓ మహిళ అక్కడిక్కడే దుర్మణం పాలైయింది. ఈ ఘటన ఆదివారం రాత్రి మేదరమెట్ల–నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం .. గ్రామానికి చెందిన రావులపల్లి పెద వెంకటేశ్వర్లు, ఏడు కొండలు, అంజయ్యల సోదరి ఆదెమ్మ (55)ను దర్శి మండలం చెర్వుకొమ్ముపారిపాలెం గ్రామానికి చెందిన తేలుకొట్ల గంగయ్యకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు మగపిల్లలు, తొమ్మిది నెలల క్రితం భర్త గంగయ్య అనారోగ్యంతో చనిపోయాడు. పుట్టింటికి వచ్చేందుకు బస్సుదిగి గ్రామంలోకి వస్తుండగా హైద్రాబాద్ నుంచి ఒంగోలు వెళ్తున్న కారు వేగంగా వస్తూ ఆదెమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తల పూర్తిగా ఛిద్రమై అక్కడిక్కడే చనిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి ఛేరుకుని భోరున విలపించారు. రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య ఆదివారం తెలిపారు. స్టువర్టుపురం–బాపట్ల రైల్వే స్టేషన్ల మధ్యగల అప్ లైన్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించినట్లు ఎస్సై చెప్పారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, రైలు వచ్చే పరిస్థితిని గమనించకుండా రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొట్టి ఉంటుందని ఎస్సై తెలిపారు. రైలు ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే వ్యక్తి మృతి చెందినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీఎం కప్ పోటీలలో చీరాల క్రీడాకారుల ప్రతిభ

చీరాల రూరల్: ఏపీ సీఎం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాల క్రీడాకారులు తమ ప్రతిభ చాటారు. ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నుంచి చీరాల క్రీడాకారులు పాల్గొన్నారు. చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ సాయి కాలనీకి చెందిన దేవరకొండ ప్రేమ్‌సాగర్ 73 కేజీల విభాగంలో పోటీపడి ఓవరాల్‌గా 232 కేజీల బరువులు ఎత్తి సిల్వర్ మెడల్ సాధించాడు. మరో చీరాల క్రీడాకారుడు టీ రవితేజ 89 కేజీల విభాగంలో పోటీపడి ఓవరాల్‌గా 195 కేజీల బరువులు ఎత్తి బ్రాంజ్ మెడల్ సాధించాడు. పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ పున్నారావు, టీమ్ మేనేజర్ డి. ప్రవీణ్ కుమార్, రిటైర్డు డీఎస్‌డీవో శ్రీనివాస్ ప్రసాద్‌లు అభినందించారు. వీరు ఇంకా అనేక పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ఫలితాలు సాధించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రతినిధులు


నీట్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులతో రద్దీగా ఉన్న రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ పరీక్షా కేంద్రం

ప్రశాంతంగా నీట్


నీట్ పరిక్ష రాసేందుకు తల్లితో కలిసి పరీక్షా కేంద్రం వద్దకు వస్తున్న విద్యార్థి

ఒంగోలు: నీట్ ఎగ్జామ్ ఆదివారం స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగింది. రైజ్ ప్రకాశం, రైజ్ గాంధీ, రైజ్‌పాలిటెక్నిక్ కాలేజీల్లో మూడు సెంటర్లలో పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే లోపలకు అనుమతించారు. రైజ్ ప్రకాశంలో 792 మందికి 15 మంది, రైజ్ గాంధీకి 408 మందికి ఐదుగురు, రైజ్ పాలిటెక్నిక్‌కు 168 మందికిగాను ఐదుగురు గైర్హాజరయ్యారు.


మెటల్ డిటెక్టర్‌తో తనిఖీ


అభ్యర్థుల హాల్ టికెట్ల పరిశీలన


బోర్డుపై రూం నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు


కూతురు చెవి కమ్మలు తొలగిస్తున్న తల్లి


జాగ్రత్తగా రాయి తల్లి..


టైం అయిపోతుంది.. పద పద

రెండు ఆలయాల్లో హుండీల చోరీ


హుండీపై వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

దొనకొండ: మండలంలోని చందవరం అంకాలమ్మ పరమేశ్వరీ, పోలేరమ్మ ఆలయాల్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై ఎం సైదుబాబు తెలిపిన వివరాల ప్రకారం...శుక్రవారం అంకాలమ్మ పరమేశ్వరీ తిరునాళ్లను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా హుండీలో కానుకలు ఉంటాయని భావించిన దుండగులు రెండు ఆలయాల్లోకి ప్రవేశించి హుండీలను పగులగొట్టి కానుకలు తీసుకొని హుండీలను 2 కిలోమీటర్ల దూరంలో చిల్లచెట్లలో పడేశారు. ఆదివారం ఉదయం గ్రామస్తులు ఆలయాల వైపు వెళ్తుండగా తలుపులు తీసినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. వారి సమాచారం మేరకు ఎస్సై సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మార్కాపురం క్లూస్‌టీం వేలిముద్రలు సేకరించారు.

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం


రైల్వేట్రాక్‌పై ఉన్న గుర్తు తెలియని మృతదేహం

కురిచేడు: ప్రకాశం, పల్నాడు జిల్లాల సరిహద్దు గుండ్లకమ్మ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న దొనకొండ రైల్వే పోలీస్ ఇన్‌చార్జి బి.పూర్ణ మహేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. రైలు ఢీకొని మృతి చెందాడా? లేక రైలు నుంచి జారిపడి మృతి చెందాడా అన్నది తెలియాల్సి ఉంది. మృతుని వయసు 30 ఏళ్లు ఉంటుందని, బ్లూ టీ షర్ట్, సిమెంటు కలర్ షాట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ మార్చురీకి తరలించారు. మృతదేహానికి సంబంధించిన వారు 9542424899 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ముండ్లమూరులో స్వల్ప భూకంపం

ముండ్లమూరు: మండల కేంద్రమైన ముండ్లమూరులో ఆదివారం స్వల్ప భూకంపం వచ్చింది. రెండు సెకన్ల పాటు భూమి కంపించడంతోపాటు శబ్దం రావంతో స్థానికులు భయాందోళకు గురయ్యారు. గతంలో రెండు పర్యాయాలు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడంతో ఇలా ఎందుకు జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు.